సాక్షి జగిత్యాల

సోమవారం | 27 | నవంబర్ | 2023



గోదావరిలో కార్తీక స్నానాలు

ధర్మపురి: ఆదివారం సెలవు కావడంతో భక్తులు గోదావరిలో కార్తీకస్నానాలను ఆచరించారు. అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు.



అటకెక్కిన హరిత లక్ష్యం

అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం పనులు ప్రహసనంగా మారాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. 6లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. సాయంత్రం, రాత్రి సమయంలో చలిగాలులు కొనసాగుతాయి.

ఆలోచించి ఓటేయాలి..

- జగిత్యాల, వేములవాడలో సీఎం ప్రజా ఆశీర్వాద సభ
- జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ తరఫున ప్రచారం.. వేములవాడలో లక్ష్మీనర్సింహారావుకు మద్దతుగా సభ



జగిత్యాలలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు హాజరైన అశేషజనం



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్

జగిత్యాల/వేములవాడ: సీఎం కేసీఆర్ ఆదివారం ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, వేములవాడ నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. ముందుగా జగిత్యాలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మూడోసారి అధికారం చేపట్టి జగిత్యాలను కరీంనగర్‌లా మార్చుతామన్నారు. ప్రజలు ఆగం కావొద్దని, ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను రెండోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారని వెల్లడించారు. కాంగ్రెస్ హయాంలో నీరు లేక, ఉద్యోగాలు లేక, కరెంట్ లేక గోస పడ్డామని, రైతుల ఆత్మహత్యలు, ఎన్నో ఘోరాలు చూశామని, తెలంగాణ తెచ్చుకున్నాక ఆ సమస్యలన్నీ తీరాయని వెల్లడించారు. జిల్లా అభివృద్ధి కళ్లముందే కనబడుతోందని, మెడికల్ కళాశాల, వరదకాలువ, సంక్షేమ పథకాలు కనిపిస్తున్నాయని తెలిపారు. రైతు రాజు కావాలనే ఉద్దేశంతో రైతుబంధు ఇస్తున్నామని, రైతులు ఎలాంటి సమస్యతో చనిపోయినా రైతుబీమా అందిస్తున్నామని వివరించారు. సాగునీటి సమస్య లేకుండా చేయడంద్వారా జిల్లామొత్తం ధాన్యంరాశులతో నిండిపోయిందన్నారు. నీటిపన్ను లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని అన్నారు. జిల్లాలో బస్తీ దవాఖానాలు, రోళ్లవాగు ప్రాజెక్ట్, వరద కాలువ వంటి అనేక పనులు చేసుకున్నామని వివరించారు. పొరబాటున కాంగ్రెస్ వస్తే కరెంట్ మళ్లీ మూడు గంటలే వస్తుందన్నారు. వేములవాడలో మాట్లాడుతూ.. వేములవాడ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావు యువకుడని, కచ్చితంగా అభివృద్ధి చేసి తీరుతాడని వెల్లడించారు. రమేశ్‌బాబు గొప్ప వ్యక్తి అని, కోర్టు కేసులతోనే ఆయనను మార్చాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో వేములవాడ, సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాలను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మరాజ్యం తెస్తామంటున్నారని.. ఇందిరమ్మ రాజ్యం బాగుంటే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ఎందుకు పెట్టేవారని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే మళ్లీ ఆకలికేకలు వినిపిస్తాయన్నారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు.

పేదల పక్షపాతి కేసీఆర్: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్ అన్నారు. ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చొరవతో జగిత్యాలను జిల్లాగా చేసుకున్నామని, రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా 4,825 డబుల్‌బెడ్‌రూంలు తెచ్చానని వెల్లడించారు. ఇప్పటివరకు రూ.నాలుగు వేల కోట్లతో జిల్లాను అభివృద్ధి చేశానని తెలిపారు. మెడికల్ కళాశాలతోపాటు 650 పడకలకు పెరిగిందని పేర్కొన్నారు. అల్లీపూర్‌ను మండలకేంద్రంగా ఏర్పాటు చేస్తామన్నారు. జగిత్యాలలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం తెస్తామన్నారు. ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు.

ఐదుగురిని అసెంబ్లీకి పంపిద్దాం: ఎమ్మెల్సీ ఎల్.రమణ

జిల్లానుంచి ఐదుగురు ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. ప్రజాఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. ఈ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి మరెక్కడా జరగలేదన్నారు. మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

అలరించిన ఆటాపాటా..

సభకు నియోజకవర్గంలోని నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలి వచ్చారు. జానపద కళాకారులు తమ ఆటపాటతో అలరించారు. కార్యకర్తలు కేరింతలు కొడుతూ కేసీఆర్ వచ్చేంతవరకూ ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ దామోదర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీమంత్రి రాజేశంగౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

జగిత్యాల: శాసనసభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల ప్రత్యేక సాధారణ పరిశీలకులు అజయ్‌నాయక్, ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్‌మిశ్రా అన్నారు. ఆదివారం జిల్లాకు చేరుకున్న వారు ఐడీఓసీలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా.. పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు జిల్లాలోని ఎన్నికలకు సంబంధించిన వివరాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏపిక్‌కార్డుల పంపిణీ, కమ్యూనికేషన్ ప్లాన్, మైక్రో పరిశీలకులు, పోస్టల్ బ్యాలెట్, హోంఓటింగ్, ఈవీఎంల ర్యాండమైజేషన్, డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్లు తదితర అంశాలను వివరించారు. ఎంసీసీ టీం, సీ విజిల్, ఫిర్యాదులు, జిల్లా గ్రీవెన్స్‌సెల్ తదితర కార్యక్రమాల అమలుతీరును వివరించారు. ఎన్నికల పరిశీలకులు రాజీవ్‌రంజన్‌మీనా, బసవ రాజేంద్ర, పోలీస్ పరిశీలకులు వివేకానంద సింగ్ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా భరణి నక్షత్ర వేడుకలు



ధర్మపురి దేవస్థానంలో యమధర్మరాజుకు ప్రత్యేక పూజలు

ధర్మపురి: భరణి నక్షత్రం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం యమధర్మరాజు దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణలతో స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆయుష్య హోమం హారతి, మంత్రపుష్పం నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

- ఎమ్మెల్సీ నర్సారెడ్డి



ఉపాధ్యాయ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నర్సారెడ్డి

జగిత్యాల: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్సీ నర్సారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్‌భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన యూటీఎఫ్ సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని, ప్రాథమిక పాఠశాలలో ఒక్కో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడిని నియమించాలని పేర్కొన్నారు. నాన్‌టీచింగ్ స్టాఫ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం ఇటీవల మరణించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తిరుకోవెల వెంకటేశం కుటుంబానికి రూ.6 లక్షల చెక్కు అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్, ఉపాధ్యక్షురాలు సుశీల, కోశాధికారి బన్న, అనిల్, ఆగమయ్య, ప్రసాద్, శ్రీనివాస్‌రావు, శ్రీధర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలి

- అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు



నివాళి అర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు

జగిత్యాలక్రైం: రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాంగం ద్వారా ప్రజలకు ప్రాథమిక హక్కులతోపాటు చట్టాలు అందుతున్నాయని వివరించారు. పోలీసు సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏవో అమర్‌నాథ్, ఆర్‌ఐ జానిమియా, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, మల్లేశ్, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ వాహనసేవ



శ్రీవేంకటేశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకులు

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ శివారు శ్రీవేంకటేశ్వస్వామి బ్రహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామివారికి హనుమాన్ వాహనసేవ నిర్వహించారు. అభిషేకం, కుంకుమార్చన, నిత్యహోమం, బలిహరణం, నివేదన చేశారు. ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్ తోట శారద, ఆలయ కమిటీ అధ్యక్షుడు కటుకం రాజేశ్, తోట లింగారెడ్డి – వెంకటలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

మూడురోజులు మద్యం దుకాణాలు బంద్

జగిత్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఈనెల 28న సాయంత్రం ఐదు గంటల నుంచి 30వరకు మద్యం దుకాణాలు మూసివేయనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. మద్యం దుకాణాలతోపాటు, బార్లు, రెస్టారెంట్లు, కల్లు దుకాణాలు కూడా మూసివేయాలని ఆదేశించారు.

కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మొద్దు



గంగపుత్రుల మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్

- కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి: కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ కోరుట్ల అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దళితులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నారని, దశలవారీగా ప్రతి కుటుంబానికీ సహాయం అందుతుందని తెలిపారు. ముందుగా పార్టీ కార్యాలయంలో బండలింగాపూర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు.

బీజేపీ, కాంగ్రెస్ డిపాజిట్లు గల్లంతు చేయాలి

మల్లాపూర్: రానున్న ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు డిపాజిట్లు గల్లంతు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని రాఘవపేటలో రోడ్‌షో నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మితే మళ్లీ గోసపడుతామన్నారు. ఎన్నికల్లో తన కుమారుడు సంజయ్‌కుమార్ గెలిపించుకోవాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్ నత్తి లావణ్య, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గంగపుత్రుల అభివృద్ధి

కోరుట్లరూరల్: గంగపుత్రుల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని జోగిన్‌పెల్లిలో ఆదివారం గంగపుత్ర సంఘ నాయకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం ఏటా చేప పిల్లలు పంపిణీ చేసి మత్స్య సంపద పెంచేందుకు కృషి చేసిందన్నారు. సర్పంచ్ దుంపాల నర్సు పాల్గొన్నారు.

సంజయ్ సోదరి ఇంటింటా ప్రచారం

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా, వర్షకొండ, తిమ్మాపూర్ గ్రామాల్లో కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌ను గెలిపించాలని ఆయన సోదరి సమత ప్రచారం చేశారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, ఎంపీటీసీ దేశెట్టి శాంత, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకటి, మాజీ ఎంపీపీ నెరేళ్ల దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

లెక్కింపు కేంద్రంలో ముమ్మరంగా ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి యాస్మిన్ బాషా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న యాస్మిన్ బాషా

జగిత్యాల: వచ్చే నెల మూడో తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. నూకపల్లిలోని వీఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. ఈనెల 28 లోపు పనులన్నీ పూర్తికావాలని ఆదేశించారు. ఏజెంట్లు, అధికారుల కోసం క్యూలైన్‌లు సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. లెక్కింపు కోసం టేబుళ్లను సక్రమంగా అమర్చాలని తెలిపారు. కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి లెక్కింపు కేంద్రాల్లోని గదులను ఆమె పరిశీలించి సీసీ కెమెరాలను భవనం చుట్టూ బిగించాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్లు లత, రిటర్నింగ్ అధికారులు దివాకర, నరసింహమూర్తి, తదితరులు ఉన్నారు.

జిల్లాలో స్టాంపుల కొరత

- ఇబ్బంది పడుతున్న ప్రజలు



స్టాంప్ పేపర్లు

జగిత్యాల: జిల్లాలో రెండునెలలుగా స్టాంపులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్థలాల క్రయవిక్రయాలు, జనన, మరణ ధ్రువీకరణ, అగ్రిమెంట్స్, నోటరీలకు ఎక్కువగా వీటి అవసరం ఉంటుంది. అయితే ధ్రువీకరణ పత్రాల లేమితో అఫిడవిట్‌లు నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా రూ.20, రూ.50, రూ.100 స్టాంప్ పేపర్లు దొరకడం గగనంగా మారుతోంది. దీంతో ప్రజలు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ద్వారా ఈ స్టాంప్ పేపర్లను పలు లావాదేవీలు, అఫిడవిట్‌లకు వినియోగిస్తుంటారు. స్థల క్రయవిక్రయాల్లో రూ.100 స్టాంపులు ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇవి మొత్తానికే లేకపోవడంతో ప్రజలను నిరాశకు గురిచేస్తున్నాయి. జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు, స్టాంప్ వెండర్లు, నోటరీల వద్ద వీటిని విక్రయిస్తుంటారు. వీటికి కూడా చేరకపోవడంతో రెండు నెలలుగా ఇబ్బందిగా మారింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి రావడం లేదని అధికారులు చెబుతున్నారు. రూ.20 స్టాంప్ పేపర్లయితే కన్పించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి స్టాంప్ పేపర్లు తెప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

> **రెండు రోజుల్లో పంపిణీ**
>
> ఎన్నికల కారణంగా రవాణాలో కొంత అసౌకర్యం ఏర్పడింది. రెండు రోజుల్లో పంపిణీ చేస్తాం. అలాగే దీనికి సంబంధించిన సిబ్బంది ఇటీవల మరణించడంతో జాప్యం జరుగుతోంది.
>
> – కిషన్‌నాయక్, సబ్ రిజిస్ట్రార్, జగిత్యాల





కనులపండువగా లక్ష దీపోత్సవం

మల్లాపూర్: మండలంలోని వాల్గొండ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి లక్ష దీపాలంకరణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సతీమణి సరోజన, సీఎస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చెన్నమనేని శ్రీనివాస్‌రావు దంపతులు, సర్పంచ్‌లు దండిక గంగు, ధరంసోత్ కళావతి, ఎంపీటీసీ క్యాతం సుజాత, నరేష్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సాంబారి శంకర్, వైస్ చైర్మన్ చిలివేరి లక్ష్మీ, అర్చకులు రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

అంజన్న సన్నిధికి పోటెత్తిన భక్తులు





స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారిని ఆదివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి తమలపాకులు సమర్పించి.. కొబ్బరికాయలు కొట్టారు. నిత్యాన్నదాన సత్రంలో భోజనాలు చేసి తిరుగుపయనమయ్యారు. భక్తుల ఏర్పాట్లను సూపరింటెండెంట్ సునీల్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సంపత్, అధికారులు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా గంగాహారతి



ధర్మపురి: ధర్మపురిలో గంగాహారతి కార్యక్రమాన్ని ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందుగా ఆలయం నుంచి గోదావరికి మేళతాళాలతో తరలివెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి గోదావరిలో దీపాలను వదిలారు. వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో గందరగోళం నివారించాలి



ఆర్డీవో కార్యాలయంలో పడిగాపులు కాస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాలటౌన్: పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో నెలకొన్న గందరగోళాన్ని నివారించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య కోరారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఆదివారం రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చిన ఉపాధ్యాయులకు వారి పేర్లు జాబితాలో లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. పనిచేస్తున్న నియోజకవర్గం, విధులు నిర్వహిస్తున్న నియోజకవర్గం మధ్య ఎక్కడ ఓటు వేయాలో తెలియక అసహనానికి గురయ్యారు. ఆర్డీవో కార్యాలయంలో గంటలకొద్దీ నిరీక్షించినా ఫలితం లేకపోయింది. కొంతమంది మొదట తమ సొంత నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోగా.. పోస్టల్ ఇవ్వలేదని, విధులు నిర్వహిస్తున్న నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకుంటే సొంత నియోజకవర్గం నుంచి అప్రూవల్ కావాలని అడుగుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఓటు వినియోగించుకోవాలంటున్న అధికారులు.. తమను మాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

క్లుప్తంగా

సీనియర్ పాత్రికేయుడి మృతి


ధర్మపురి(ఫైల్)

రాయికల్: పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ముంజ ధర్మపురిగౌడ్(57) ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. 20 సంవత్సరాలుగా ఈనాడు, ఉషోదయం, ఆంధ్రప్రభ, ప్రజాతంత్ర, చురకలు దినపత్రికల్లో పని చేశారు. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా.. చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానిక రాయికల్ ప్రెస్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

రూ.50 లక్షలు పట్టివేత

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండం బైపాస్ వద్ద పోలీసులు ఆదివారం రాత్రి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై వెంకట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం(ఎఫ్ఎస్‌టీ) స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. ఈక్రమంలో గోదావరిఖని నుంచి రామగుండం వైపు వస్తున్న ఇన్నోవా వాహనంలో సోదాలు చేశారు. ఇందులో రూ.50లక్షల నగదు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నగదుకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు చూపించలేదన్నారు. నిబంధనల మేరకులా సొమ్ము సీజ్ చేసినట్లు పోలీసులు వివరించారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి

కోనరావుపేట: ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా బోల్తాపడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని నిజామాబాద్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈర్ల లచ్చయ్య–లక్ష్మీ దంపతుల కుమారుడు బాబు (24) వెంకట్రావుపేట–నిజామాబాద్ గ్రామాల మధ్య ఉన్న పొలం వద్దకు వెళ్లాడు. ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా బోల్తాపడడంతో బాబు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందా డు. మృతుడికి భార్య నేహ, కుమారుడు విఘ్నేష్ (4), కూతురు తన్విత (3) ఉన్నారు. మృతుడి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించారు. గ్రామస్తుల సా యంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని యువకుడికి గాయాలు


గాయపడిన సాయికృష్ణ

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలకేంద్రంలో ఆదివారం ఓ పార్టీకి చెందిన ర్యాలీ ఉండటంతో ట్రాఫిక్‌ను వన్‌వేలో మళ్లించారు. దీంతో ఎదురెదురుగా వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి గ్రామానికి చెందిన చుక్క రాజశేఖర్, అంకారపు సాయికృష్ణ వెళ్తుండగా పెద్దలింగాపూర్‌కు యువకుడు బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో సాయికృష్ణ తలకు తీవ్రగాయాలు, రాజశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు.

బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

- గులాబీమయంగా జగిత్యాల
- భారీగా తరలివచ్చిన జనం


హాజరైన జనం

జగిత్యాల: జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమయింది. దీంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. సీఎం కేసీఆర్ ఆదివారం గీత విద్యాలయంలో జరిగిన ప్రజా ఆశీ ర్వాద సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో కేసీఆర్ జగిత్యాలకు హెలిక్యాప్టర్‌లో వచ్చారు. కలెక్టరేట్ వద్ద హెలి ప్యాడ్ వద్ద దిగగా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా కాన్వాయి ద్వారా సభకు వెళ్లారు.

జనమయం.. మైదానం..

కేసీఆర్ సభలో పాల్గొని ప్రసంగించడం, ప్రజలు సైతం అత్యధికంగా రావడం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. సీఎం రాక సందర్భంగా నియోజకవర్గాల నుంచి మహిళలు, వృద్ధులు, ప్రజలు తరలివచ్చారు. గీతా విద్యాలయం స్టేడియం పూర్తిగా నిండిపోయింది. కళాకారులు నృత్యాలతో అలరించారు. గులాబీ కండువాలతో గ్రౌండంతా నిండిపోయింది. సీఎం వచ్చేలోపు కళాకారులు పాటలతో ఉర్రూతలూగించారు. సీఎం సభ విజయవంతం కావడంతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ అభినందనలు తెలిపారు.

భారీ బందోబస్తు

జగిత్యాలక్రైం: సభకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందున్న హెలిప్యాడ్‌లో మధ్యాహ్నం 2.40గంటలకు కేసీఆర్ హెలిక్యాప్టర్ నుంచి దిగారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ నుంచి నేరుగా కారులో సభ వేదిక వద్దకు తీసుకెళ్లారు. సభ ముగియగానే 3.40గంటలకు సీఎం హెలిప్యాడ్‌కు చేరుకొని వెళ్లిపోయారు. సభ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

అటకెక్కిన హరిత లక్ష్యం

- ఖాళీ కుండీలు.. ఖర్చు రూ.లక్షలు
- ప్రహసనంగా మారిన మొక్కల పెంపకం
- కానరాని మొక్కలు.. మాయమైన కుండీలు
- ప్రజాధనం రోడ్డుపాలు


చెట్ల పొదల్లో వృథాగా కుండీలు


బైపాస్ రోడ్డులో ఖాళీ కుండీలు

జగిత్యాలటౌన్: అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం పనులు ప్రహసనంగా మారాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా చేపట్టిన హరిత లక్ష్యం ఆదిలోనే అటకెక్కుతోందనే విమర్శలున్నాయి. మౌలిక సదుపాయాల కల్పన గాలికొదిలేసి.. ప్రచార ఆర్భాటం కోసం హరితహారం పేరుతో జరుగుతున్న ప్రజాధనం వృథాపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రగతి నిధుల నుంచి రూ.8లక్షల బడ్జెట్ కేటాయించి 1,000 కుండీలు కొనుగోలు చేసిన అధికారులు దాదాపు 600 కుండీల్లో మాత్రమే మొక్కలు నాటారు. ఇరుకై న రోడ్లు, నిర్వహణ లోపంతో కొన్ని కుండీలు ధ్వంసమవగా.. మరికొన్ని కుండీలు మాయమయ్యాయి. సర్వైవల్ లేదంటూ మిగతా 400 కుండీలను పంప్‌హౌస్ వద్ద పొదల్లో నిరుపయోగంగా ఉంచారు.

అధికారుల నిర్లక్ష్యం..

ఇరుకై న రోడ్లు, పార్కింగ్ సమస్య, నిర్వహణ లోపంతో మొక్కలు ఎండిపోగా.. పెట్టిన కుండీలు సైతం మాయమయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం, అత్యుత్సాహంతో ఖాళీ కుండీలు.. ఖర్చు రూ.లక్షలు అన్న చందంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు సర్వైవల్ లేదంటూ కుండీల్లో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని మధ్యలోనే నిలిపేశారు. బల్దియా అధికారుల తీరుతో హరిత లక్ష్యం నెరవేరడం సంగతి దేవుడెరుగు.. రూ.లక్షల ప్రజాధనం మాత్రం వృథా అయిందంటూ పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బల్దియా అధికారుల అనాలోచిత నిర్ణయానికి తోడు పాలకవర్గం ప్రచార ఆర్భాటం కోసం వృథా అయిన ప్రజాధనానికి బాధ్యులెవరని పన్నులు కట్టిన ప్రజలు నిలదీస్తున్నారు.

హడావుడి..

ఏదైనా కార్యక్రమం మొదలుపెట్టే ముందు హడావుడి చేస్తున్న అధికారులు.. ఆ తర్వాత నిర్వహణను గాలికొదిలేస్తున్నారని విమర్శలున్నాయి. సాధ్యాసాధ్యాలు ఆలోచించకుండా ఇరుకైన రోడ్డులో పెద్ద పెద్ద కుండీలు.. వాటిలో మొక్కలు పెట్టి వాటి నిర్వహణపై నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా అయిందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

కుండీలు మాయం

మౌలిక సదుపాయాల కల్పనను పట్టించుకోకుండా పట్టణంలోని ప్రధాన రోడ్లకిరువైపులా కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. ఇరుకైన రోడ్లు, పార్కింగ్‌కు చోటు లేకుండా షాపుల ముందు ఏర్పాటు చేసిన కుండీలను షాపుల యజమానులు పట్టించుకోలేదు. బల్దియా అధికారుల నియంత్రణ కరువై చాలాచోట్ల కుండీలు మాయమవగా.. బైపాస్ రోడ్లు లాంటి కొన్నిచోట్ల ఖాళీ కుండీలు డివైడర్లపై వృథాగా పడి ఉన్నాయి.

నిరుపయోగం..

నాటిన మొక్కలు ఎండిపోవడంతో రోడ్ల వెంట ఉన్న కుండీలు మాయమయ్యాయి. సర్వైవల్ లేదంటూ కుండీల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మధ్యలోనే నిలిపేసిన అధికారులు.. పెద్ద మొత్తంలో కుండీలను పంప్‌హౌస్ వద్ద చెట్లపొదల్లో వదిలేశారు. వానకు నాని, ఎండకు ఎండిన కుండీలు పగిలి పనికి రాకుండా పోతున్నాయి.

అధికారులే బాధ్యత వహించాలి



ఇరుకైన రోడ్లకు తోడు షాపుల ముందు పార్కింగ్ సైతం లేని పరిస్థితుల్లో యావర్ రోడ్డుతో పాటు పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట పెద్దపెద్ద కుండీల్లో మొక్కలు నాటడం అధికారుల అనాలోచిత చర్య. వృథా అయిన ప్రజాధనానికి అధికారులే బాధ్యత వహించాలి. బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. – చిత్తారి మధుకర్, జగిత్యాల

సర్వైవల్ లేదు

పాలకవర్గం నిర్ణయం మేరకు రోడ్లకిరువైపులా కుండీల్లో మొక్కలు నాటాం. సర్వైవల్ లేకపోవడంతో నిలిపేశాం.
– రాజేశ్వర్, డీఈ, జగిత్యాల మున్సిపాలిటీ

ఎన్నికల సంఘం ఆదేశాలతో నిలిచిన రోడ్డు పనులు


ధర్మపురిలో గోదావరి తీరం వద్ద నిలిచిపోయిన రోడ్డు పనులు

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులను తక్షణం నిలిపేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో పనులను ఆపారు. భూబాధితుల వివరాల ప్రకారం.. ధర్మపురి పట్టణంలోని సర్వే నెంబర్ 17, 18లో గోదావరి తీరానున్న స్థలాన్ని మంగలిగడ్డగా పిలుస్తుంటారు. పురాతన కాలం నుంచి తాత, ముత్తాల నుంచి వస్తున్న ఈ భూమిలో సుమారు 56 గుంటల పట్టా భూమి ఉంది. అందులో 21 గుంటల స్థలం ధర్మపురికి చెందిన కురిమల్ల శంకర్, రాజం, సీతారాములుకు చెందింది. మిగిలిన 35 గుంటల స్థలంలో దుబ్బయ్య, గాలిపెల్లి శంకర్ తదితరులతో పాటు మరికొంతమంది హక్కుదారులుగా ఉన్నారు. ప్రస్తుతం ఈ స్థలంలో చిరు వ్యాపారులు తాత్కాలిక షెడ్లు వేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా ఈ స్థలం మధ్యలో నుంచి సీసీ రోడ్డు నిర్మాణం చేపడితే బాగుంటుందని భావించి సదరు హక్కుదారులతో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో మాట్లాడారు. భూమి కోల్పోయిన హక్కుదారులకు నష్ట పరిహారం అందిస్తామని తెలిపి సుమారు రూ.2కోట్ల నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. నెలలు గడుస్తున్నా నష్ట పరిహారం చెల్లించలేదని హక్కుదారులు దుబ్బయ్య, గాలిపెల్లి శంకర్, రాజం తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

భూమి కోల్పోయిన భూహక్కుదారులకు నష్ట పరిహారం చెల్లించకపోవడంతో ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పనులను నిలిపేయాలని ఆర్డీవో, స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పనులు కొనసాగడంతో భూమి యజమానులు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్ రోడ్డు పనులను తక్షణం నిలిపేయాలని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు పనులను నిలిపేయాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషాకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రోడ్డు పనులను నిలిపేశారు.

పనులు చేపట్టొద్దు



భూమి కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారం చెల్లించేవరకు రోడ్డు పనులు చేపట్టొద్దు. రోడ్డు పనుల్లో భూమి కోల్పోయిన వారికి నష్ట పరిహారం చెల్లిస్తామని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం చెల్లించాలి.
– కురిమల్ల శంకర్, సంఘం అధ్యక్షుడు

పరిహారం చెల్లించాలి

ధర్మపురిలో ఉన్న ఈ భూమి ఎంతో విలువైంది. భూమికున్న విలువను బట్టి పరిహారం చెల్లించాలి. ప్రస్తుతం చిరు వ్యాపారులు తాత్కాలిక షెడ్లు వేసుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. – దుబ్బయ్య

అభ్యర్థుల వాయిస్ మెసెజ్‌లతో ప్రచారం



రాయికల్: జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల ప్రధాన పార్టీ అభ్యర్థులు వాయిస్ మెసెజ్‌లతో ప్రచారం ప్రారంభించారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో తనకు ఓటేయాలని కోరుతూ ప్రతిరోజు సెల్ వినియోగదారులకు వాయిస్ మెసెజ్ రూపంలో రికార్డును వినిపిస్తున్నారు. తను ఫలానా పార్టీ నుంచి పోటీ చేస్తున్నా.. మీకు అందుబాటులో ఉంటున్నా.. స్వయంగా వచ్చి కలవలేకపోతున్నా.. క్షమించాలి.. మీ అమూల్యమైన ఓటు తనకు వేయాలని కోరుతున్నారు. ప్రతిరోజు ఈ మెసెజ్‌లు రావడంతో ఓటర్లు అసహనానికి గురవుతున్నారు.

బీఎస్పీ అభ్యర్థి వాహనంపై దాడి

చందుర్తి (వేములవాడ): నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి గోలి మోహన్‌పై మండలకేంద్రంలో ఆదివారం దాడిచేశారు. మండలకేంద్రంలోని బీఎస్పీ పార్టీకి చెందిన కార్యకర్త మృతిచెందడంతో పరామర్శించేందుకు వెళ్లిన తమ వాహనంపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేశారంటూ ఆరోపించారు. మహిళా కార్యకర్తపై దుర్భాషలాడి, కులం పేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ రెండు వాహనాలపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

జమ్మికుంట(హుజూరాబాద్): మండలంలో ఓ వివాహిత అదృశ్యమైంది. పట్టణ సీఐ రమేశ్ వివరాల ప్రకారం.. కోరపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత తన కుమారుడితో ఈ నెల 24న జమ్మికుంట పట్టణానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. వివాహిత భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పెద్ద నోట్లు రద్దు.. పార్టీలకు తగ్గిన పద్దు



పెగడపల్లి: ఓటర్లను మభ్యపెట్టేందుకు డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ రాజకీయ పార్టీలు ఎన్నికలను డబ్బుతో ముడిపడేలా మార్చేశాయి. తమకు డబ్బులివ్వలేదని ఓటర్లు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసిన సందర్భాలు కోకొల్లలు. ఎన్నికలంటేనే డబ్బుతో కూడుకున్న విషయంగా మారిపోయింది. నాయకులు ఎవరిని ప్రసన్నం చేసుకోవాలన్నా జేబులో చెయ్యి పెట్టి ఎంతో కొంత ముట్టజెప్పాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే గతంలో ఉన్న పెద్ద నోట్లు ప్రస్తుతం కనిపించకపోవడంతో ఆశించిన వారికి చిన్నవే దక్కుతున్నాయి. 2014 సాధారణ ఎన్నికల్లో పెద్ద నోటు రూ.1,000 కనిపించింది. అదే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ నోటు రద్దు కాగా.. రూ.2 వేల నోటు వచ్చింది. అప్పుడే ఎన్నికల్లో నాయకులు తమ జేబుల్లో చెయ్యి పెడితే రూ.2 వేల నోట్లు బయటికి రావడంతో ఆశించిన వారు పండుగ చేసుకునేవారు. పెద్ద నోట్లతో నేతలకు సైతం భారంగా మారింది. అయితే ఇటీవల రూ.2 వేల నోట్లు రద్దు కావడంతో ఈ ఎన్నికల్లో రూ.500 నోట్లే కనిపిస్తున్నాయి. తనిఖీల్లో దొరికిన నోట్ల కట్టల్లో అత్యధికంగా రూ.500 నోట్లే దొరుకుతున్నాయి. చోటామోటా కార్యకర్తలు పెద్ద నోట్లు కనిపించకపోవడంతో దిగాలుగా ఉన్నారు.

ఇదీ సెక్షన్.. తప్పదు యాక్షన్

- నిబంధనలు అతిక్రమిస్తే ఎవరైనా శిక్షార్హులే
- ఎన్నికల చట్టాలపై యువతలో పెరిగిన ఆసక్తి
- ఇంటర్నెట్‌లో సర్చ్ చేస్తున్న విద్యార్థులు, యువత

కరీంనగర్ అర్బన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులను ఎన్నుకోవడానికి చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఎన్నికల సమయంలో ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం ఎక్కువ కేసులు నమోదు చేస్తుంటారు. ప్రచారంలో పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు అదుపుతప్పి వ్యవహరిస్తే దండన తప్పదు. సామాన్య పౌరులు సైతం ఫిర్యాదు చేసినా.. పోలీసులు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు. పలువురు విద్యార్థులు, యువత ఇంటర్నెట్లో ఎన్నికల చట్టాలు– నిబంధనల గురించి సెర్చ్ చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కొన్ని ఎన్నికల చట్టాలను వివరించే కథనం.



సెక్షన్ 123: జాతి, మతం, కులం, సంఘం, భాషను రెచ్చగొట్టేలా వ్యవహరించడం, ఒత్తిడికి లోను చేస్తే.. ఈ సెక్షన్ కింద ఫిర్యాదు చేయొచ్చు.

125: ఎన్నికల సందర్భంగా వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందిస్తే మూడేళ్ల పాటు జైలు శిక్ష లేదా జరిమానా రెండింటినీ విధించే అవకాశం ఉంటుంది.

126: ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు నిర్వహిస్తే శిక్షార్హులు. దీనికి రెండేళ్ల జైలు లేదా జరిమానా విధిస్తారు.

127: ఎన్నికల సమావేశం సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడినా.. పోలీస్ అధికారి అయినా ఆ వ్యక్తులను అరెస్టు చేయొచ్చు. ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.2 వేల జరిమానా.

128: బహిరంగంగా ఓటేస్తే మూడు నెలల జైలు లేదా జరిమానా.

129: ఎన్నికలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది, పోలీసులు పోటీచేసే అభ్యర్థికి సహకరించినా, ప్రభావం కలిగించినా శిక్షార్హులు. దీనికిగాను 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా విధిస్తారు.

130: పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల లోపల ప్రచారం చేయొద్దు. ఒకవేళ చేస్తే రూ.250 జరిమానా పడుతుంది.

131: పోలింగ్ కేంద్రానికి సమీపంలో నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే.. ఏ పోలీస్ అధికారి అయినా ఆ సామగ్రిని స్వాధీనం చేసుకోవచ్చు. 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా, రెండూ అమలు చేయొచ్చు.

132: ఓటేసే సమయంలో నియమ నిబంధనలు పాటించనివారికి 3 నెలల జైలు శిక్ష లేదా జరిమానా.

134: అధికార దుర్వినియోగానికి పాల్పడితే శిక్షార్హులే. ఇందుకు రూ.500 జరిమానా విధిస్తారు.

134(అ): ఠాణా పరిసర ప్రాంతాలకు మారణాయుధాలతో వెళ్లడం నిషేధం. అలా వెళ్లినవారికి 2 నెలల జైలుశిక్ష, జరిమానా వేస్తారు.

135: పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ పత్రం, ఈవీఎం అపహరిస్తే శిక్షార్హులు. ఏడాది పాటు జైలుశిక్ష, రూ.500 జరిమానా.

135(ఇ): పోలింగ్, కౌంటింగ్ రోజున మద్యం విక్రయించడం, మద్యం, డబ్బు ఇవ్వడానికి ఆశ చూపడం నేరం. అందుకు 6 నెలల జైలుశిక్ష, రూ.2 వేల వరకు జరిమానా.

133: ఎన్నికల సందర్భంగా ఓటర్లను పోలింగ్ బూత్ వద్దకు చేరవేసేందుకు వాహనాలు సమకూర్చినా, అద్దెకు తీసుకున్నా శిక్షార్హులు. అందుకు 3 నెలల జైలుశిక్ష, జరిమానా.

135(అ): ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల రోజు వేతన సెలవుగా మంజూరు చేసినా శిక్ష, అందుకు రూ. 5వేల జరిమానా విధించొచ్చు.

49వీ: ఒక వ్యక్తి ఓటు మరొకరు వేస్తే పోలింగ్ ఆఫీసర్‌కు సదరు ఓటరు 49–వీ సెక్షన్ ప్రకారం తన ఆధారాలు చూపాలి. ప్రిసైడింగ్ ఆఫీసర్ సదరు ఓటరుకు ఓటు వేసే అధికారం కల్పిస్తారు.

134(అ): ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంటుగా గానీ పోలింగ్ ఏజెంటుగా గానీ, ఓట్ల లెక్కింపు సందర్భంగా గానీ ఏజెంటుగా వ్యవహరిస్తే శిక్షార్హులు. అందుకు 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా.

పురిట్లోనే శిశువు మృతి..

- వైద్యుల నిర్లక్ష్యంతోనేనని బంధువుల ఆందోళన
- సిరిసిల్ల జిల్లాసుపత్రిలో ఘటన


ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న బంధువులు


పసికందు మృతదేహం

సిరిసిల్లటౌన్: మెరుగైన వైద్యం అందుతుందని జిల్లాసుపత్రికి వస్తే..పురిట్లోనే పసికందు మృతిచెందిన సంఘటన సిరిసిల్లలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..బీవైనగర్‌కు చెందిన బల్ల మీనాక్షిను భర్త శ్రీకాంత్ శనివారం సాయంత్రం డెలివరీ కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చాడు. అడ్మిట్ చేసుకున్న వైద్యులు ఆదివారం ఉదయం తమకు ఎలాంటి సమాచారం లేకుండానే డెలివరీ చేశారని, మృతిచెందిన పసికందు పుట్టిందని చెప్పడంతో కన్నీరుమున్నీరయ్యారు. తాము ఆస్పత్రికి తీసుకువచ్చినప్పుడు ఆపరేషన్ చేయకుండా నిర్లక్ష్యం చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. ఇందులో తమ పొరపాటు ఏమీలేదని, ఇతర కారణాల వల్ల శిశువు మృతిచెందిందని పేర్కొన్నారు.

రాజన్న కోడెలు మృత్యువాత



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం గోశాలలోని మూడు కోడెలు ఆదివారం మృతిచెందినట్లు సీనియర్ అసిస్టెంట్ శ్యామ్ తెలిపారు. రోగాల బారినపడి చికిత్స అందించినా నయంకాక మృత్యువాత పడినట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

మానకొండూర్: మండలంలోని సదాశివపల్లి స్టేజీ సమీపంలో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై ఆదివారం లారీ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైనాయి. స్థానికుల కథనం మేరకు.. సదాశివపల్లి గ్రామానికి చెందిన సంగసాని రాజిరెడ్డి, కమటం సత్తయ్య ద్విచక్రవాహనంపై అల్గునూర్ వెళ్తుండగా, కరీంనగర్ నుంచి వరంగల్ వెళ్తున్న లారీ అతివేగంతో ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు గంటసేపు రహదారిపై బైఠాయించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీసంఖ్యలో వాహనాలు నిల్చిపోయాయి. మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్, తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు.